
# 3 శాతం ఇవ్వాల్సిందే

- దివ్యాంగులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: ఉద్యోగ నియామకాల్లో చట్టప్రకారం కేటాయించిన మూడుశాతం రిజర్వేషన్‌ను దివ్యాంగులకు కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దివ్యాంగులకు ఉద్యోగాల్లో మూడుశాతం రిజర్వేషన్ కల్పించే చట్టం 1995లోనే అమలులోకి వచ్చినప్పటికీ.. వాస్తవపరిస్థితి హృదయవిదారకంగా ఉందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులు మూడుశాతం కన్నా చాలాతక్కువగా ఉన్నారని తెలిపింది. గ్రూప్ ఏ, గ్రూప్ బీ పోస్టుల పరిధిలోకి వచ్చే ఎంపిక చేసిన ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించకుండా కేంద్రప్రభుత్వం 1997, 2005లో రెండు ఆదేశాలను వెలువరించింది. వీటిని వ్యతిరేకిస్తూ ప్రసారభారతి సంస్థకు చెందిన దివ్యాంగ ఉద్యోగులు సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీనిపై జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రేలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సదరు ఆదేశాలు చట్టవిరుద్ధమని ధర్మాసనం పేర్కొంది. ఏ, బీ గ్రూపు పోస్టులతో పాటు అన్ని తరగతుల ఉద్యోగాల్లో, నియామకప్రక్రియతో సంబంధం లేకుండా దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని తెలియజేసింది.